# కారణమెవరైనా, బలైనది బడుగు జనాలే

తాడిపత్రిలోని ప్రబోధానంద ఆశ్రమం దగ్గర, వినాయక నిమజ్జనం సందర్భంగా, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడి, అనేక మంది తీవ్ర గాయాలపాలు కావటం, ఒకరు మృతి చెందటం జరిగింది. ఈ విషయమై మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త ఎ. చంద్రశేఖర్, రాష్ట్రకార్యదర్శి అబ్దుల్ రసూల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బన్న, జిల్లా ఉపాధ్యక్షులు శశాంక మౌళి, జిల్లా ట్రెజరర్ నరసింహ మూర్తి మరియు రైతుకూలీ సంఘం నాయకుడు రాజారాం రెడ్డి కలిసి నిజనిర్ధారణ బృందంగా ఏర్పడి, ఆశ్రమాన్ని, సమీపంలో ఉన్న పెద్దపొడమల, చిన్నపొడమల గ్రామాలను పరిశీలించటం జరిగింది.

పరిసర గ్రామాల ప్రజలను, బాధితులను విచారించగా, వారు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో ఆశ్రమంవాళ్లు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను (మల-మూత్రాలను) ఊరి వంకలో త్రాగునీటి బోరు దగ్గర పడేసేవారు. దీని వలన త్రాగునీరు కలుషితమై, తమ ఆరోగ్యాలు పాడవుతున్నాయని, రెండు-మూడు సార్లు గ్రామస్తులు, ఆశ్రమంవారిని హెచ్చరించారు. అయినా వారు, తమ పద్ధతి మార్చుకోకపోయేసరికి, ఆ వ్యర్థాలను మోసుకెళ్ళే వాహనాన్ని గ్రామస్తులు తగలబెట్టారు. తరువాత ఆశ్రమం ముందున్న రహదారిపై గ్రామంలోని పశువులు పేడవేస్తే, ఆ పేడను ఆ పశువుల యజమానులు వెంటనే వచ్చి ఎత్తివేయాలి. లేకపోతే వారిని వెదికి పట్టుకొని, తిట్టి-కొట్టి శుభ్రం చేయించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆశ్రమంవారి చర్యలకు భయపడిన ప్రజలు ఆ రహదారిని ఉపయోగించటమే దాదాపుగా మానేసారు. అయితే, “ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జనం సందర్భంగా, ఊరేగింపుగా వెళ్లే రహదారిలో, ఈ సంవత్సరం కూడా వెళ్లాలి. ఒక్క సంవత్సరం ఆ దారిలో వెళ్ళకపోతే ఇంక ఎప్పటికీ రానీయరు” అని, పోలీసులు ప్రజలను రెచ్చగొట్టి, ఆ దారిలోనే ఊరేగింపు వెళ్ళేలా చేసారు. ప్రజలు అరుపులు, కేకలు, తప్పెట శబ్దాలతో ఊరేగింపుగా వెళ్తూ, ఆశ్రమం దగ్గర కాసేపు ఆగారు. అప్పుడే ఆశ్రమభక్తులు ప్రజలపై దాడిచేసి వారి ట్రాక్టర్లను, వినాయకుడి విగ్రహాలను కూడా తగలబెట్టారు. మరుసటి రోజు ఆశ్రమానికి వ్యతిరేకంగా, స్థానిక ఎం.పి. దివాకర్ రెడ్డి ధర్నా చేయగా, ఆశ్రమంవాళ్లు ఎం.పి. పై, ఆయనకు మద్దతుగా వచ్చిన ప్రజల పై సర్పంచ్ పై, కవరేజ్‌కొచ్చిన మీడియా రిపోర్టర్‌ల పై, చివరికి పోలీసుల పై కూడా దాడిచేశారు. ఆటోలు, బైక్‌లు, కార్లు మరియు బండల ఫ్యాక్టరీలు దహనం చేశారు. ముందుగానే సిద్ధంచేసుకున్న ములుగర్రలాంటి ఇనుప పైపులతో, పెద్దపెద్ద కట్టెలతో, బండరాళ్ళతో దొరికిన వాళ్లను దొరికినట్టు చితకబాదారు. ఈ క్రమంలో గ్రామ సర్పంచ్, ఎం.పి. దివాకర్ రెడ్డి కూడా భయంతో పారిపోయారు. పక్కీరప్ప అనే వ్యక్తి మృతి చెందాడు. అనేక మందికి తీవ్ర గాయాలైనాయి. కొందరికి కాళ్ళు-చేతులు విరిగాయి. కొందరికి భుజాలు విరిగాయి. కొందరికి తలకు, కళ్ళకు బలమైన గాయాలై చూపు కోల్పోయారు.

పై నుంచి వచ్చిన ఒత్తిళ్ళ మేరకు, పోలీసులే తమను ఆ రహదారిలో పిల్చుకెళ్లి, కొట్టించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆశ్రమంలో భోజనంతో సహా ఏదీ ఉచితం కాదని, అన్నీ ఎక్కువ ధరపెట్టి కొనుక్కోవాలని, ఊరికి ఎటువంటి లాభం లేని ఆశ్రమం తమకు వద్దని, ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించారు.

ప్రబోధానంద ఆశ్రమంవారిని విచారించగా – "వారు కావాలని ఎవరి మీద దాడి చేయలేదని, ఏమి చేసినా ఆత్మరక్షణ కోసం చేసారని, వారి ప్రశాంత వాతావరణానికి భగం కల్గిస్తుంటే చేసారని, గొడవలో వారికి కూడా దెబ్బలు తగిలాయని, వాళ్ళ మనుషులను రిమాండ్‌కు తరలించి, ఆశ్రమం దగ్గర 144 సెక్షన్ విధించటం వలన, పున్నమికి–అమావాస్యకి జరిగే కార్యక్రమాలకు అవరోధం ఏర్పడిందని, ఆశ్రమంలో వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే దుష్ప్రచారాల వల్ల, వారి ఇమేజ్ డ్యామేజ్‌అయ్యి, తలెత్తుకోలేక పోతున్నారని, అక్కడ ఉండే అంగళ్ళ ద్వారా జరిగే వ్యాపారం ఆగిపోయి, ఆర్థికంగా నష్టపోయారని, గ్రామస్తులు వారి మీద చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని" తెలియజేశారు.

మా విచారణలో తేలిన విషయాలు ఏమిటంటే –– గతంలో తమ వాహనాన్ని తగలబెట్టారనే కక్షతో, ఇక తమ ఆశ్రమం వైపు ఎవరూ కన్నెత్తిచూడకుండా, తమ అన్యాయాలను, దౌర్జన్యాలను ఎవరూ ప్రశ్నించకుండా, ఆశ్రమం ముందున్న రహదారిలో ఎవరూ రాకపోకలు సాగించకుండా, ప్రజలను–ప్రజాప్రతినిధులను భయభ్రాంతులను చేయటానికే ఈ సామూహిక హింసాకాండకు ఆశ్రమం వారు తెగబడ్డారు. కనిపించిన వారందరిపై అత్యంత హింసాత్మకంగా స్పందిస్తూ, విచక్షణా రహితంగా దాడిచేయడం గమనిస్తే, ఈ మధ్యకాలంలో బి.జె.పి. అధికారంలోకి వచ్చాక, దేశవ్యాప్తంగా జరుగుతున్న మూకదాడుల్లాంటిదే ఇది కూడా అనిపిస్తుంది. అసలు ఒక ఎం.పి ని కూడా తరిమి కొట్టేంత ధైర్యం వాళ్ళకు ఎలా వచ్చింది? తెరవెనుక ఎవరి ప్రోద్బలం, అండదండలు, మద్దతుతో వీరు ఇంతకు సాహసించారు? అమావాస్యకు – పున్నమికి వచ్చిపోయే స్థానికేతర భక్తులు ఇంతకు తెగిస్తారా? అని అనుమానమొస్తుంది కానీ, ఇది ఖచ్చితంగా స్థానికేతరుల తెగింపుతో జరిగిన దౌర్జన్యకాండే. ఎందుకంటే స్థానికులలో దివాకర్ రెడ్డిని ఎదిరించే దమ్ము ఎవరికీ లేదు. దాడికి పాల్పడిన విధానం గమనిస్తే, ఇదంతా ముందస్తు ప్రణాళిక ప్రకారం, కక్షగట్టి చేసినట్టుగా అనిపిస్తుంది. ఆశ్రమంవారికి, గ్రామస్తులకు మధ్య రహదారి విషయమై, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల విషయమై, గతంలో గొడవలు జరిగాయని తెల్సినా, ఆశ్రమం ముందున్న దారిలో వెళ్తే వచ్చే వంకలో నీళ్ళు లేవని తెల్సినా, కావాలని ప్రజలను ఉసిగొల్పి, ఆశ్రమం మీదుగా ఊరేగింపు వెళ్ళేలా పోలీసులు చేయటం వల్లనే, అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడి గొడవలు జరిగాయి. పరిస్థితి సున్నితంగా ఉన్నప్పుడు, ఎటువంటి చర్యలు తీసుకోని పోలీసులు, జరగాల్సిందంతా జరిగిపోయాక 144 సెక్షన్ విధించి, పరిశీలన కోసం వచ్చే బయటి వ్యక్తులను ఆశ్రమంలోనికి రానీకుండా, కనీసం ఆశ్రమం వారిని కూడా స్వేచ్ఛగా తిరగనీకుండా ఇబ్బంది పెడుతున్నారు. అసలు ఈ గొడవంతటికీ ప్రధాన కారణం, పోలీసుల వైఫల్యమే.

అంత్రాలు వేస్తూ బతుక్కునే ఒక ఆర్.ఎం.పి. డాక్టర్, స్వామీజీగా మారి కోట్ల రూపాయలు విరాళాలు ఇచ్చే స్థాయికి ఎలా ఎదిగాడు? ఆశ్రమానికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయ్? కేవలం భక్తులు ఇచ్చే విరాళాలు, త్రైత సిద్ధాంత భగవద్గీత వంటి ఆధ్యాత్మిక పుస్తకాలు అచ్చువేసి అమ్మటం ద్వారా నిధులు సమకూరుతాయని ఆశ్రమంవారు ఇచ్చే సమాధానం నమ్మశక్యంగా, సంతృప్తికరంగా లేదు. ఆశ్రమం చుట్టుప్రక్కల ఉండే ఇండ్లు–పొలాలు తక్కువ ధరకు కొనటం, లేకపోతే భక్తుల కానుకగా, గురుదక్షిణగా, భక్తులే ఉచితంగా సమర్పించుకునేలా వారిని మాయ చేయటం, అదీ వీలుకాకపోతే, చివరికి ఏదో ఒక ఉపాయంతో వాటిని కబ్జాచేసి, ఆశ్రమాన్ని విస్తరించుకుంటూ పోవటం -- ఇవి, భక్తి–ఆధ్యాత్మికత ముసుగులో ఆశ్రమాన్ని నడుపుతున్న ప్రబోధానంద కార్యకలాపాలు. తన ఆశ్రమసామ్రాజ్య విస్తరణకు, స్వచ్ఛందంగా సహకరించనందుకు గ్రామ సర్పంచు పై, అతనికి అండగా ఉన్న ఎం.పి. పై కక్షగట్టారు. నిమజ్జనం సందర్భంగా జరిగిన గొడవలో వారి కక్ష తీర్చుకోవటానికి అవకాశం దొరికింది. అంతే, మూఢ భక్తులమూకతో ప్రజాప్రతినిధులను కూడా తిప్పలాడించి పరార్ అయ్యేలా చేసారు.

ఈ గొడవలో మరో కోణం ఏమిటంటే, ఇది పైకి గ్రామ ప్రజలు వర్సెస్ ఆశ్రమంలా కనిపిస్తుంది. కానీ వాస్తవానికి ఇది, ప్రబోధానంద వర్సెస్ ఎం.పి.దివాకర్ రెడ్డి. గొడవలో దాడికి పాల్పడ్డ ఆశ్రమంవారి టార్గెట్ కూడా, దివాకర్ రెడ్డి మరియు ఆయనకు మద్దతుగా నిలబడ్డవారే. గొడవ జరిగిన మరుసటి రోజు ఆశ్రమాన్ని సీజ్ చేయాలని, దాడికి పాల్పడ్డవారిని అరెస్ట్ చేయాలని, ఎం.పి. ధర్నా చేసింది, ప్రజల మీద ప్రేమతో కాదు. మరి దేనికోసమంటే -- ఈ మధ్య కమ్మ కళ్యాణ మంటపం నిర్మాణానికి, ప్రబోధానంద కోటి రూపాయలు విరాళం ఇవ్వటం ద్వారా, కమ్మ సామాజిక వర్గమంతా దివాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఏకమయ్యారు. దివాకర్ రెడ్డి డబ్బు డిమాండ్ చేస్తే, ప్రబోధానంద చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. తర్వాత ఆశ్రమ ట్రస్టీ మెంబర్‌గా, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి కూతురు ఉంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో ప్రబోధానందకు పరిచయాలున్నాయి. ఇటీవల బి.జె.పి.వాళ్ల సభకు హాజరైన, నాయకులు–కార్యకర్తలకు ఆశ్రమంవారు భోజనాలు పెట్టారు. ఈ విషయాలన్నీ బేరీజు వేసుకొని, "భవిష్యత్తులో ప్రబోధానంద తనకు బలమైన ప్రత్యర్థిగా పోటీలో నిలబడతాడేమో, తిరుగులేని తన ఆధిపత్యానికి అడ్డుచక్రం వేస్తాడేమో"ననే అభద్రతా భావంతో, ప్రబోధానందకు చెక్ పెట్టటానికి, రాజకీయ ఎత్తుగడలో భాగంగా, అగ్గికి ఆజ్యంపోస్తూ ఎం.పి. దివాకర్ రెడ్డి ధర్నా చేసాడు.

సరే, ఏది ఏమైనప్పటికినీ, ఈ మొత్తం గొడవలో బలి అయ్యింది మాత్రం, అమాయక ప్రజలే, ఈ వ్యవహారంతో ఏమాత్రం సంబంధంలేని సామాన్యులే. అంతా మాదిగ, చాకలి, బోయ లాంటి దళిత బహుజన కులాలకు చెందిన నిరుపేదలే. గొడవ వల్ల వీరు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా చితికిపోయి ఉన్నారు. బలమైన గాయాలతో త్వరగా కోలుకోలేక, పనికి పోలేక, తమ

పనులు తాము చేసుకోలేక, తిండికి–వైద్యానికి చేతిలో చిల్లిగవ్వలేక, ఆదుకొనేనాథుడు లేక, అప్పుల పాలై అలమటిస్తున్నారు. 'తక్షణం బాధితులకు ఏదైనా సహాయం చేయాలి' అనే భావన ఆశ్రమం వారికి అస్సలు లేదు. 'మా వల్లే గొడవలు జరిగి, ఇంత ఆస్తినష్టం, ప్రాణనష్టం జరిగి, ప్రజలు బాధ పడుతున్నారు' అనే గిల్టీ ఫీలింగ్ కూడా వారికి ఏ కోశాన లేదు. ఇక ఎం.పి. గురించి చెప్పాల్సిన పనే లేదు. ప్రభుత్వం కథ సరేసరి.

మా డిమాండ్స్:

**1)** **తీవ్ర గాయాలపాలైన బాధితులకు తక్షణమే వైద్యం ఖర్చులకు, జీవనానికి తగిన ఆర్థిక సహాయం అందజేయాలి. ఈ విషయంలో గొడవకు కారకులైన ఆశ్రమంవారు, యం.పి. చొరవ తీసుకోవాలి.**

**2)** **కుటుంబదిక్కును కోల్పోయిన పక్కీరప్ప భార్యకు, ప్రభుత్వం యొక్క 'ఆపద్భందు' పథకం వర్తింపజేసి, మూడెకరాల పొలం ఇచ్చి, తగిన నష్టపరిహారం అందించాలి.**

**3)** **వ్యవసాయానికి ఆధారమైన ట్రాక్టర్లు, బ్రతుకుతెరువుకు ఆధారమైన ఆటోలు–బండల ఫ్యాక్టరీలు, వ్యక్తిగత అవసరాలకు ఉపయోగపడే బైక్‌లు దహనకాండలో కోల్పోయినవారికి ఇన్సూరెన్స్‌తో సంబంధం లేకుండా తగిన నష్టపరిహారం అందించాలి.**

**4)** **భవిష్యత్తులో ఇటువంటి సామూహిక దాడులు మళ్ళీ జరగకుండా, ముందుజాగ్రత్తగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి.**

**5)** **పెద్దపొడమల, చిన్నపొడమల గ్రామస్తులకు ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలి.**

**6)** **ఆశ్రమం ముందున్న పబ్లిక్‌రోడ్‌ను, సమీప గ్రామాల ప్రజలు ఎవరైనా స్వేచ్ఛగా, నిర్భయంగా, సహజంగా ఉపయోగించుకొనేలా గట్టిచర్యలు తీసుకోవాలి. పశువులు పేడవేస్తే బెదిరించి ఎత్తివేయించడం అనే దౌర్జన్యకాండకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఈ విషయంలో ఆశ్రమం వారికి పోలీసులు గట్టిగా వార్నింగ్ ఇవ్వాలి.**

**7)** **ఆశ్రమం వారు తమ సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను, త్రాగునీరు–సాగునీరుకు ఆధారమైన సమీప గ్రామాల వంకల్లో పడేయకుండా, తగిన కట్టడి చేయాలి.**

**8)** **ఈ గొడవపై ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ నివేదికను వెంటనే బహిర్గత పరచాలి. నివేదికను అనుసరించి ఎటువంటి చర్యలు తీసుకున్నారో అధికారులు తెలియజేయాలి.**

**9)** **ఆశ్రమంలో జరిగే కార్యక్రమాలన్నీ రహస్యానికి తావులేకుండా, పారదర్శకంగా జరిగేలా గట్టి చర్యలు తీసుకోవాలి.**

మానవ హక్కుల వేదిక,

తేది: 19.11.2018

అనంతపురము.